క్లుప్తంగా

పేదలకు మరింత చేరువగా వైద్య సేవలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదలకు వైద్యసేవలను మరింత చేరువ చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. స్థానిక చుట్టుగుంట డాక్టర్ చల్లా హరికుమార్ ఆస్పత్రిలో గురువారం ఉచిత బోన్ ఫంక్షన్ టెస్ట్(బీఎండీ)లు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఎముక సంబంధిత సమస్యలు ఎక్కువవుతున్నాయని ముందుగానే కనిపెట్టి బోన్ ఫంక్షన్ టెస్టు(బి.ఎం.డి)ను డాక్టర్ చల్లా హరికుమార్ ఉచితంగా అందించడం అభినందనీయమని కొనియాడారు. డాక్టర్ హరికుమార్ మాట్లాడుతూ ఎముక సంబంధిత సమస్యలకు ప్రివెంటివ్ చికిత్సను అందించడం ద్వారా చాలా వరకు నయం చేయవచ్చన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పరీక్షలు చేయించుకున్నారు.

ముగిసిన దత్తసాయి మందిర వార్షికోత్సవం




మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక పసుపుతోట శ్రీదత్తసాయి మందిర వార్షికోత్సవం గురువారం ఘనంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు 21 దివ్యద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం, విశేషంగా హారతులు, పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమం చేశారు. సాయినక్షత్రమాలిక 10వ మహాయజ్ఞంలో 54వ పర్వం పారాయణం, సంకీర్తన వేదపండితులతో జరిగింది. మధ్యాహ్నం సుమారు రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

కుంగ్‌ఫూ, కరాటేలో విద్యార్థుల ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రుద్రమదేవీ ఫొటోకాన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 5వ తేదీన జరిగిన సీఎం కేసీఆర్ మెగా కప్ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. జాతీయస్థాయిలో 2 గోల్డ్ మెడల్స్, 2 సిల్వర్, 13 బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. సత్తా చాటిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ అమలాపుష్పం గురువారం ప్రత్యేకంగా అభినందించారు. కోచ్ రూపాస్‌పాల్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

రోయింగ్ క్రీడాభివృద్ధికి సహకారమివ్వండి



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలో రోయింగ్ క్రీడను అభివృద్ధి చేసేందుకు సమకారమందించాలని ఏపీ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) వీసీ, ఎండీ కె.హర్షవర్ధన్‌ను ఏపీ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, ఖేలో ఇండియా సౌత్‌జోన్ సభ్యుడు తరుణ్ కాకాని కోరారు. శాప్ ఎండీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్‌ను శాప్ కార్యాలయంలో తరుణ్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి మొక్కను అందజేశారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తేవాలని ప్లానింగ్ విభాగ కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం శారద జూనియర్ కళాశాల 49వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించాలన్నారు. చక్కటి భవితకు సూచనలు, సలహాలు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు ఆర్ఐఓ రవికుమార్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ ఆర్‌డీ షా, వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్ చంద్ గుప్తా, కార్యదర్శి కుందా సీతారామ శాస్త్రి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగేశ్వరరావు, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రూ.4.16 కోట్ల వ్యయ అంచనాతో వైవీరావు ఎస్టేట్‌లో రిజర్వాయర్ పనులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, అధికారులు, కాలనీ పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని, నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ పరిధిలోని వైవీ రావు ఎస్టేట్స్‌లో రూ.4.16 కోట్ల వ్యయ అంచనాతో చేపట్టిన 1500 కేఎల్ రిజర్వాయర్ నిర్మాణ పనులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో నగరంలో ఎక్కడ చూసినా తాగునీటి సమస్య తలెత్తేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి ఎద్దడిని నగర ప్రజలకు లేకుండా చేయడానికి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గానికి మూడు వైపులా వైవీ రావు ఎస్టేట్, దావు బుచ్చయ్యకాలనీ, గుణదలలోని ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి రూ. 3.30 కోట్లు, వీఎంసీ జనరల్ నిధుల నుంచి రూ.86.49 లక్షలతో రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. దీని ద్వారా వైవీ రావు ఎస్టేట్ నుంచి ఇందిరానాయక్‌నగర్ వరకూ ఉన్న పరిసర ప్రాంతాల్లోని ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వాంబే కాలనీలో రూ.77 కోట్ల వ్యయ అంచనాతో 5ఎంజీడీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటుచేయనున్నామన్నారు. కార్పొరేషన్ సీఈ ప్రభాకర్, ఈఈ శ్రీనివాస్, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, వైవీ రావు ఎస్టేట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి నాగేశ్వరరావు, కార్యదర్శి విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్య నగర్‌లో రూ.7.45 కోట్ల వ్యయ అంచనాతో 1500 కేఎల్ రిజర్వాయర్ నిర్మాణం, పంపింగ్ మెయిన్ పైపులైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 వేల మంది జనాభాకు తాగునీరు అందించేందుకు చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ జానారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. సకార్యక్రమంలో సీఈ(ఇంజనీరింగ్) ప్రభాకర్, ఈఈ(ఇంజనీరింగ్) శ్రీనివాస్, నాయకులు గోపిశెట్టి శ్రీను, అమ్ముల రవికుమార్, తుంపాల వరప్రసాద్, మార్తి చంద్రమౌళి, గద్దె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆడియో పాఠాలు



ప్రోత్సాహక పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకురాలు డాక్టర్ శ్రీచరిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులైన విద్యార్థులు క్లాసులో వెనకపడకుండా వారికోసం ఆడియో పాఠాలు రికార్డు చేయించి అందజేసిన అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.శ్రీచరితను స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో గురువారం పొలిటికల్ సైన్సు అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ శ్రీచరిత ఆధ్వర్యాన కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహక పుస్తకాల అభినందన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రత్యేక విద్యార్థులు చివరి సెమ్‌లో ఫెయిల్ అయ్యారని దీనిపై దృష్టిసారించిన అధ్యాపకురాలు శ్రీచరిత విద్యార్థులకు నోట్స్ ఇచ్చి పాఠాలను అర్థమయ్యేరీతిలో ఆడియో చేయించారన్నారు. వీటి ద్వారా ప్రత్యేక చిన్నారులు ఎప్పుడు కావలిస్తే అప్పుడు పాఠాలు విని తక్కిన విద్యార్థులతో సమానంగా రాణించే అవకాశం ఉందన్నారు. ఆడియో రికార్డింగ్‌కు సహకరించిన విద్యార్థులకు అధ్యాపకురాలు శ్రీ చరిత సుమారు రూ.15వేలు విలువ చేసే పుస్తకాలను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, పద్మనాభం, కేఆర్‌జీ శేషుకుమార్, రమేష్ తదితరు లు పాల్గొని డాక్టర్ శ్రీచరితను అభినందించారు.

ప్రణాళిక విభాగ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న విద్యుల్లత తదితరులు

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రణాళిక విభాగంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డైరెక్టర్ కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్ ఆర్‌జే విద్యుల్లత అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో గురువారం ఏపీ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ డైరీ–2023 ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ జోనల్ కమిటీ అధ్యక్షులు వశీంబేగ్ ఆధ్వర్యాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో డీటీసీపీ అడిషనల్ డైరెక్టర్లు వి.సునీత, శ్రీనివాసులు, అసోసియేషన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు హరిదాస్, అబ్దుల్ సత్తార్, డైరీ కమిటీ చైర్మన్ డి. కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి



సిద్ధార్థ ఆడిటోరియంలో తరుణి తరంగాలు మహిళ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో విజేతలతో అతిథులు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు భయాన్ని వీడి ఏ రంగంలోనైనా ధైర్యంగా ముందడుగు వేయాలని ఎస్‌బీఐ డీజీఎం కె.రంగరాజన్ సూచించారు. తరుణీతరంగాలు ఆధ్వర్యాన సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న మహిళా ఫెస్ట్–2023 గురువారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో రంగరాజన్ మాట్లాడుతూ.. మహిళలు నేడు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని కొనియాడారు. గతంలో పాఠశాల విద్యకే పరిమితమైన మహిళలు నేడు విద్య, సాంకేతికత అంశాల్లో పురుషులను సవాల్ చేసే స్థాయిలో ఉండటం హర్షణీయమన్నారు. యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎం రజనీకాంతరావు మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తమ బ్యాంకు నుంచి తక్కువ వడ్డీకే రుణాలను అందజేస్తున్నామని చెప్పారు. ఇండియన్ బ్యాంక్ ఏరియా మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. యువత విద్యార్థి జీవితాన్ని ఎంజాయ్ చేయాలన్నారు. తరుణీ తరంగాలు సంస్థ కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి మహిళా ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ ప్రసంగించారు. ముగింపు సభకు జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్. విద్యాకన్న అధ్యక్షత వహించారు. వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి, డాక్టర్ కె.సత్యవతి, తరుణీ తరంగాలు అధ్యక్షురాలు రావి శారద, సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

- మహిళా ఫెస్ట్‌లో భాగంగా గురువారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేశారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై భవానీపురం స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవానీపురానికి చెందిన యువతి బీటెక్ పూర్తి చేసి గ్రీన్ ట్రెండ్స్ సెలూన్‌లో మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆ సమయంలో ప్రవీణ్ అనే వ్యక్తి తాను బిజినెస్‌మెన్‌ను అని పరిచయం చేసుకున్నాడు. గ్రీన్ ట్రెండ్స్ కొనుగోలు చేయాలనుకుంటున్నాను సహాయం చేయాలని యువతిని కోరాడు. ఆలా ఆమెతో చనువుగా ఉండడం ప్రారంభించాడు. ఆమెకు వేరేవ్యక్తితో ఎంగేజ్‌మెంట్ అయ్యింది. విషయం తెలుసుకున్న ప్రవీణ్ ఆమెఎంగేజ్‌మెంట్ చెడగొట్టాడు. తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన యువతి, ఆమె తల్లి ఇద్దరు అతనితో కలిసి గోవా, రాజమండ్రి పలు చోట్లకు వెళ్లారు. అతని మాటలు నమ్మిన ఆమె ఇంటిలో పోర్షన్‌ను అమ్మేసింది. వచ్చిన డబ్బు రూ.17లక్షలు ప్రవీణ్ తన సొంతానికి వాడుకున్నాడు. ఆమె వద్ద ఉన్న బంగారం తీసుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని అడగడంతో బిజినెస్‌లో లాస్ వచ్చిందంటూ దాటవేస్తూ వచ్చాడు. మరో వ్యక్తి ద్వారా.. పవీణ్‌కు ఇప్పటికే పెళ్లి అయ్యిందని ఒక పాప ఉందని తెలిసింది. ప్రవీణ్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడగ్గా తమకు సంబంధం లేదని చెప్పి ఆమెను దూషించారు. దీంతో తాను మోసపోయామని భావించిన ఆ యువతి భవానీపురం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన వాంఛలు తీర్చుకున్నాడని, బంగారం, నగదు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది.

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈనెల 13వ తేదీ నుంచి ఉపాధి ఆధారిత జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సును ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా సూచించారు. మరింత సమాచారానికి 7799669907, 9347779032లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్–2023 షోటోకాన్ జపాన్ ఇండియా ఆర్గనైజేషన్ లో వరంగల్ నర్సంపేట (తెలంగాణస్టేట్)లో ఈనెల 5,6 తేదీల్లో కరాటే టోర్నమెంట్ జరిగాయి. ఈ టోర్నమెంట్ లో శారద కరాటే స్కూల్(స్టూడెంట్) విద్యార్థులు జాతీయ స్థాయి ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించిన ఎం.నవ్య, పి.ఆదిత్య, సిల్వర్ మెడల్ సాధించిన డి.నీలిమ, ఇ.వెంకటసూర్య, ఎస్.సాత్విక్, ఎస్.తరుణ్ కార్తికేయ, బ్రాంజ్ మెడల్ సాధించిన ఎస్‌కె మున్నా, ఇజ్జు దుర్గారావులను గురువారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కోచ్‌లు బల్లం కిషోర్, ఎం.కన్న, పి.సత్యలను, ఏపీటీఎస్ చీఫ్ ఎగ్జామినర్ టి.వాసును సన్మానించారు. సుబ్బారెడ్డి, దుర్గారావు, రామిరెడ్డి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

గడువులోగా ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి

కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానం పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఈవోలు, ఆర్వోలు, ఏఆర్వోలు ఈఆర్వోలతో సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 16, 27,392 మంది ఓటర్లు నమోదు కాగా, వీరిలో 12, 28, 006 మంది ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానించినట్లు చెప్పారు. జిల్లాలో 75.46 శాతం ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన ఓటర్ల డేటాకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయనున్నామన్నామన్నారు. ఓటర్ల జాబితాలో డెమోగ్రాఫికల్లీ సిమిలర్ ఎంట్రీస్ (డీఎస్ఈ), ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సంబంధించి పరిష్కరించే ప్రక్రియ వేగంగా జరుగుతోందని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. వీసీలో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్, డీఆర్వో కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.

లోకేష్ పొర్లుదండాలు పెట్టినా టీడీపీ రాదు

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు



ఆర్ఆర్‌పేటలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీపై, చంద్రబాబు పాలనపై రాష్ట్ర ప్రజలతో పాటుగా ఆ పార్టీ కార్యకర్తలు కూడా విరక్తి చెందారని, లోకేష్ పొర్లు దండాలు పెడుతూ రాష్ట్రం మొత్తం తిరిగినా టీడీపీకి ఒక్క సీటు కూడా రాదని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్‌లోని 241వ వార్డు సచివాలయం పరిధిలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన 155 గడపలను సందర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పేపర్లకు పరిమితమైందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని అమలుచేస్తున్నారన్నారు.

- 22 ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూములను డీనోటిఫై చేయాలని, న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ ప్రాంతాల్లో చేతులు మారిన ఇళ్ల రీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ సౌకర్యం లేని వాటికి జీఓ నెంబర్ 4, 225, 36ద్వారా రిజిస్ట్రేషన్ల సౌకర్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం విజయవాడ నగర చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.
- డబ్బులు ఇచ్చి లోకేష్ యాత్రకు జనాలను తరలించడం సిగ్గుచేటు రాష్ట్రంలో టీడీపీ పూర్తిగా కనుమరుగైందని, లోకేష్ పాదయాత్రకు డబ్బులు ఇచ్చి ప్రజలను తరలిస్తున్నట్లు స్వయంగా ఆ పార్టీ నాయకులే చర్చించుకోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడి మాటల్లోనే ఆ విషయం మరోసారి స్పష్టమైన విషయం రాష్ట్ర ప్రజలందరూ గమనించారని తెలిపారు. తెలుగు భాష పరువును లోకేష్ తీస్తున్నారని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ గురునాథం, సీడీఓ జగదీశ్వరీ, నేతలు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, నిర్మల, జాన్‌బాబు, తోపుల వరలక్ష్మి పాల్గొన్నారు.

పుస్తకం పిలుస్తోంది..



పుస్తకం పిలుస్తోంది.. అవును పుస్తక ప్రియులను ఆహ్వానిస్తోంది నగరంలో గురువారం ప్రారంభించిన పుస్తక మహోత్సవం. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణం ఈ మహోత్సవానికి వేదికగా మారింది. ఇక్కడ 220 స్టాళ్లు ఏర్పాటుచేశారు. తొలిరోజు మహోత్సవానికి పెద్ద సంఖ్యలో పుస్తక ప్రియులు తరలివచ్చారు. ప్రముఖులు ఇక్కడ జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కాలేజీ స్థలం కాపాడుతాం

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మంత్రి బొత్సకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 6.67 ఎకరాల అతి విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల కోరల నుంచి కాపాడుతామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యాన పూర్వ విద్యార్థి అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు నేతృత్వంలో గురువారం విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణను కలిశారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు లంకా జానయ్య, డాక్టర్ వెలగా జోషి, వేణుగోపాల్, ఎస్‌వీఆర్, శ్రీధర్ తదితరులు కళాశాల స్థలాన్ని కాపాడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

ప్రకటన

అన 2023 వ నం. ఫిబ్రవరి నెల 09వ తారీకున నా క్లయింటయినటువంటి యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ రూరల్ మండలం, గున్నగారు కాపురస్తులు అవుతు (లేటు) కోటిరెడ్డి గారి కుమారుడు అవుతు వీరారెడ్డిగారి యొక్క నయాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా, ఈ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తి నా క్లయింటు వారి స్వార్జితపు సొమ్ముతో భీమవరపు సుబ్బారెడ్డి గారి భార్య భీమవరపు రమాదేవి గారి వద్ద ది. 16.08.2019న గున్న నబీ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్టరు కాబడినట్టి విక్రయ దస్తావేజు నెం. 3951/2019 రు ద్వారా కొను గోలు చేసి యున్నారు. అన నా క్లయింటు ది. 09.02.2023న టు వీలర్ మీద వెళ్ళుచుండగా పై ఒరిజనల్ డాక్యుమెంటు కల బ్యాగ్ బీసెంట్ రోడ్ పరిసర ప్రాంతాలలో జారి పడిపోయినది. కావునా సదరు డాక్యుమెంటు వేరెవరికైనను దొరికిన యెడల ఈ దిగువ తెలిపిన అడ్రసుకు స్వయముగా కాని, రిజిస్టరు పోస్ట్ విత్ ఎక్నాలెడ్జ్ మెంట్ ద్వారా కాని అందజేయగలరు. అయితే సదరు డాక్యుమెంటు దొరికిన వారు నా క్లయింటు యొక్క హక్కులకు వ్యతిరేకముగా ఉపయోగించిన యెడల నా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురని. షెడ్యూల్‌లోపై సదరు లావాదేవీలు నా క్లయింటు యొక్క హక్కులకు భంగం కలుగచేయరాదని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : యన్. టి. అర్. జిల్లా (పూర్వం కృష్ణా జిల్లా), గున్న నబీ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, గున్నగారు పంచాయతీ ఏరియాలో చేరిన గున్న గ్రామ ఆర్. సర్వే నెం. 704/2రు నబీ డివిజన్ కాబడిన దరిమిలా ఆర్. సర్వే నెం. 704-2-ఎ, దాఖలా య. 1.00 ట్లు స్థిరాస్తికి భూమికి హద్దులు :: తూర్పు : భీమవరపు వెంకటరెడ్డి గారి భూమి, దక్షిణం : ఖాజీ దూన్యం, పడమర : భీమవరపు సుబ్బారెడ్డి గారి భూమి, ఉత్తరం : కొల్లా నరసింహారావు వగైరాల భూమి యీ నాలుగు హద్దుల మధ్య య. 1.00 ట్లు లేక హె.0. 4048క్లు స్థిరాస్తి శేరీ మెరక భూమి అందుగల యావత్తు ఈజ్మెంట్ హక్కులతో సహా.

సి.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, అడ్వకేట్
26-20-15, 2వ ఫ్లోరు, స్వామి వీధి, గాంధీనగర్, విజయవాడ-5.
సెల్ :9399975668.

తే.09-02-23
విజయవాడ

మరియమాతకు వందనం



మేరిమాత విగ్రహం



కొవ్వొత్తులు వెలిగిస్తున్న దృశ్యం



ఉత్సవాలకు వచ్చిన విశ్వాసులు



సమష్టి దివ్యబలిపూజ చేస్తున్న ఫాదర్

గుణదల మేరీమాత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, గోల్డెన్ జుబిలేరియన్ గురువు ఫాదర్ పుతెన్ పుర, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేశారు. సమష్టి దివ్య బలి పూజలో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ : 90102 01611

Office mail : sakshiads@gmail.com